క్లుప్తంగా

మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద ఓటర్లను నమస్కరిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారని, రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని తన ఓటును కల్లూరు అర్బన్ 33వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. అనంతరం ఆయన కల్లూరు అర్బన్‌లోని ముజఫర్‌నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, 20 వార్డులోని సెయింట్ జోసఫ్ పాఠశాల, లక్ష్మీపురం, పందిపాడు, కృష్ణానగర్, డాక్టర్స్ కాలనీ, శరీన్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమానికి ప్రజలు ఓటేశారన్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారన్నారు. రాష్ట్రంలోని పేద,బడుగు,బలహీనవర్గాలతో పాటు మహిళలు, వృద్ధులు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సీఎం జగన్ చెప్పడంటే చేస్తాడని నమ్మకం ప్రజలకు ఉందన్నారు. అందుకే వారు ఓటేసేందుకు పోటెత్తారని చెప్పారు. పాణ్యంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కర్నూలులో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం



ఓటు హక్కును వినియోగించుకున్న కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఏపీలో పెరిగిన ఓటింగ్ శాతం వైఎస్సార్‌సీపీ ప్రభంజనానికి నిదర్శనమని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి అవుతున్నారని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం దామోదరం సంజీవయ్య మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా ఉండడంతో ఓటేందుకు కదలివచ్చార న్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, కర్నూలులో వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ విజయాన్ని ఎవరూ ఆపలేరని జోష్యం చెప్పారు. కర్నూలు కొండారెడ్డి బురుజుపై మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగువేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెబ్‌కాస్టింగ్ పరిశీలన



వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పోలింగ్ సరళిని పరిశీలించేందుకు నేరుగా జనరల్ అబ్జర్వర్ జాఫర్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ రంగంలోకి దిగారు. కలెక్టర్ ఉదయం 5 గంటల నుంచి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలన చేశారు. మాక్ పోలింగ్, పోలింగ్ ప్రారంభంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు కలెక్టర్ అక్కడే ఉండి వెబ్ కాస్టింగ్ లైవ్ ద్వారా పరిశీలించారు. మధ్యాహ్నం నుంచి జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ కూడా కంట్రోల్ రూమ్‌లో ఉండి శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు పలు సూచనలు చేశారు.

వర్షంలో పోలింగ్ కేంద్రానికి వెళ్లిన కలెక్టర్...

కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఉదయం 6.10 గంటలకు కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్‌ను పరిశీలించేందుకు వెళ్లారు. అయితే ఆ సమయంలో వర్షం పడుతోంది. అయినా ఆమె లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి మాక్ పోల్‌ను పరిశీలించి అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు.




ఓటు పిలుస్తోంది.. కల్లూరు జెడ్పీ హైస్కూల్ పీఎస్‌లో బారులు తీరిన ఓటర్లు



గణేష్‌నగర్‌లో వృద్ధుడిని స్కూటీపై తీసుకెళ్తున్న దృశ్యం



చిన్నారిని చంకన పెట్టుకుని ..



సిల్వర్‌జూబ్లీ కాలేజీ వద్ద ఓటేసి బయటకు వస్తున్న ఓ కుటుంబం



పోలింగ్ కేంద్రం వైపు అడుగులు



వీకర్ సెక్షన్ కాలనీ సెయింట్ క్లారెట్ స్కూల్ వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఓటెత్తారు

● నగరంలో పెరిగిన పోలింగ్ శాతం
● 63.87 శాతం నమోదు
● 2019తో పోల్చితే 4శాతం హెచ్చు
● ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
● ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్, నాయకులు

కర్నూలు (టౌన్) : ఓటర్లు పోటెత్తారు.. ప్రజాతీర్పు ఇచ్చేందుకు బారులు తీరారు. తమ విలువైన ఓటును వినియోగించుకుని రాజ్యాంగ హక్కును చాటుకున్నారు.కర్నూలు నగరంలో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు క్యూ కట్టారు. మహిళలు భారీగా తరలి వచ్చారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులు నడవలేని వారు వీల్ చైర్లలో వచ్చి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాతబస్తీ ఏరియాలోని ఉస్మానియా కళాశాల, గడ్డ, మాంటిస్సోరి పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్ల పెద్ద సంఖ్యలో బారులు తీరారు. సాయంత్రం 6 గంటల సమయంలో సైతం వందలాది మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్నారు. మొత్తం మీద నియోజకవర్గంలోని 258 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పాతబస్తీ ఏరియాలో తెలుగుదేశం, అధికార పార్టీ నేతల మధ్య చిన్న పాటి గొడవలు జరిగాయి. ఇబ్బందులు సృష్టించాలని తెలుగుదేశం నాయకులు పోలింగ్ స్టేషన్ల వద్ద హడావుడి చేశారు. పోలీసులు సైతం ప్రతిపక్ష పార్టీకే వత్తాసు పలికారని స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. సిల్వర్ జూబ్లీ కళాశాల పోలింగ్ స్టేషన్ వద్ద టీడీపీ, అధికార పార్టీ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు. ఇక పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. తాగునీరు, షామియానాలు, మందులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రతి పోలింగ్ బూత్ వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశారు.

పెరిగిన పోలింగ్ శాతం

2019 ఎన్నికల్లో నమోదైన పోలింగ్‌తో పోల్చితే ఈ సారి కర్నూలు నియోజకవర్గంలో ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగింది. గత ఎన్నికల్లో కర్నూలులో 59.53 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో రాత్రి వరకు 63.87 శాతం ఓటింగ్ నమోదైంది. గతంతో పోల్చితే దాదాపు నాలుగు శాతం అధికంగా నమోదైంది. మహిళలు భారీగా తరలివచ్చి ఓటు వేయడంతోనే పోలింగ్ శాతం పెరిగిందని అధికార వైఎస్సార్‌సీపీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు నియోజకవర్గంలో పోలింగ్ సరళిని కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పరిశీలించారు. ఉదయం నుంచే ఆయన అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి ఏజెంట్లతో మాట్లాడారు. అలాగే కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అహమ్మద్ అలీఖాన్, పార్టీ నాయకులు నగరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రెండు మూడు గంటలకు ఒకసారి వెళ్లి అక్కడ పోలింగ్ సిబ్బంది. పార్టీ ఏజెంట్లతో మాట్లాడారు. పాతబస్తీ ఏరియాల్లో పలుచోట్ల తెలుగుదేశం నాయకులు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేయడంతో ఆ ఏరియా పోలీసు యంత్రాంగం పనితీరుపై విమర్శలు వస్తున్నాయి.

ఓటు హక్కు వినియోగం

వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సోమవారం స్థానిక కొత్తపేటలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ 25 వ వార్డులోని దేవనగర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కర్నూలు మండలంలో ప్రశాంతం

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్, అర్బన్ మండలాల్లో సోమవారం సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రూరల్ మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలు, అర్బన్ మండలంలో మూడు వార్డులు ఉన్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్ పుసుపులలోని ప్రాథమిక ఉర్దూ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే విధంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సైతం అదే గ్రామంలో ఓటు వేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ఆయన స్వగ్రామం పంచలింగాల గ్రామంలో ఓటు వేశారు. కర్నూలు అర్బన్ మండలంలోని మామిదలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లను టీడీపీ సానుభూతి పరులు ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారు. అదే విధంగా మాసామసీదుకి చెందిన టీడీపీ నాయకులు చివరిలో కేంద్రంలోకి వెళ్లి దొంగ ఓట్లు వేసేందుకు యత్నించారు. అయితే, అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉండటంతో వారి ప్రయత్నాన్ని విరమించుకున్నారు.





మేము ఓటేశాం..ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్



కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ దంపతులు



సాయంత్రం 6.30 గంటల సమయంలో బుధవారపేట మున్సిపల్ స్కూల్ వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు

సదుపాయాలు భేష్!

● వృద్ధులు, సీనియర్ సిటిజన్‌లు, గర్భిణులకు ప్రత్యేక ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు బాగుండడంతో ఓటర్లెవరూ ఇబ్బంది పడలేదు. ప్రతి పోలింగ్ కేంద్రం వెలుపల షామియానాలు ఏర్పాటు చేశారు. కూర్చోవడానికి కుర్చీలను ఉంచారు. వృద్ధులను తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ర్యాంపులను ఏర్పాటు చేశారు. వీల్‌చైర్లను అందుబాటులో ఉంచారు. వృద్ధులను వీల్ చైర్ల ద్వారా తీసుకెళ్లడానికి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, మాజీ సైనిక ఉద్యోగులు సాయం చేశారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రంలో మంచినీటిని అందుబాటులో ఉంచారు. వచ్చిన ఓటర్లకు ఏ పోలింగ్ బూత్‌కు వెళ్లాలో చెప్పడానికి ఓటర్ బూత్ అసెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలోకి రావడానికి, వెళ్లడానికి ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేయడంతో వచ్చిపోయే ఓటర్లెవరూ ఇబ్బంది పడలేదు. అత్యవసరంగా వచ్చిన ఓటర్లు అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్స చేయడానికి అవసరమైన మెడికల్ క్యాంప్‌లను కూడా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఓటింగ్ కోసం వచ్చిన సీనియర్ సిటిజన్‌లు, వృద్ధులు, గర్భిణులకు నేరుగా వెళ్లి ఓటు వేసేలా ఏర్పాటు చేసి ఇబ్బందులు కలుగకుండా చూడడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు.



వృద్ధురాలిని వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న పోలీసులు



పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఓటరు అసెస్ డెస్కు



మెడికల్ క్యాంపు



వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపు

దొంగ ఓట్ల పేరుతో టీజీ భరత్ రభస

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఉస్మానియా డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా ఉన్న ఒక సామాజిక వర్గం వారు దొంగ ఓట్లు వేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ రభస సృష్టించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన తన అనుచరవర్గంలో పోలింగ్ కేంద్రంలోకి వచ్చారు. ఆ కళాశాలలోని మొత్తం మూడు కేంద్రాల్లో కలియదిరిగి అక్కడ పనిచేసే ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లను దబాయించారు. కొంత మంది దొంగ ఓట్లు వేస్తున్నారని, అడ్డుకోకుండా మీరేం చేస్తున్నారని మండిపడ్డారు. చాలా మంది బురఖాలు ధరించి దొంగ ఓట్లు వేయడానికి వస్తున్నారని, వారిని తీక్షణంగా పరిశీలించి ఓటుకు అనుమతించాలని రభస చేశారు. తాము ప్రతి ఒక్కరి స్లిప్‌లు, ఓటర్, ఆధార్ కార్డులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటు వేసేందుకు అనుమతిస్తున్నామని ఉద్యోగులు, ఏజెంట్లు బదులిచ్చారు. అప్పటి వరకు నమోదైన ఓట్ల వివరాల గురించి ఆయనకు వివరించారు. దొంగ ఓట్లు వేసేరనడానికి ఎలాంటి ఆధారం లేకపోవడంతో ఆయన అక్కడ నుంచి వెనుదిరిగారు. టీజీ భరత్ వచ్చి రభస చేస్తున్నారని తెలియడంతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, సీనియర్ నాయకులు అహ్మద్ అలీఖాన్ వచ్చి పరిస్థితిని పర్యవేక్షించారు.



పోలింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీజీ భరత్

వీకర్‌సెక్షన్ కాలనీలో..

కల్లూరు: పాణ్యం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అయితే, కల్లూరు అర్బన్ 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ పరిధిలోని బీసీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం దగ్గర టీడీపీ శ్రేణులు అలజడి సృష్టించాడానికి ప్రయత్నించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నంద్యాల జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పార్వతమ్మ తనయుడు శివ, నాయకులు అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సాయంత్రం పోలింగ్ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డిని సైతం అలానే చేశారు. దీంతో ఇరువురు మధ్య అక్కడ కొద్దిపాటి వాగ్వాదం జరిగింది. ఓటమి భయంతోనే టీడీపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారి అత్యుత్సాహం

పాణ్యం: మండలంలోని కౌలూరు గ్రామంలోని 294 పోలింగ్ కేంద్రంలో ఓ అధికారి అత్యుత్సాహం చూపారు. ఏకంగా ఓటర్లను పక్కదారి పట్టించి టీడీపీ ఓట్లు వేయించే ప్రయత్నం చేశాడు. వృద్ధుల వెంట వచ్చిన కుటుంబ సభ్యులను కాదని ఆ అధికారి స్వయంగా ఈవీఎం వద్దకు వెళ్లి బటన్ నొక్కుతూ కనిపించాడు. అనుమానం వచ్చి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు నిలదీయడంతో అక్కడి టీడీపీ ఏజెంట్లు వారిని బెదిరించారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు వెంటనే తమ నాయకులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న నాయకులు పోలీసుల సమక్షంలో పోలింగ్ కేంద్రం అధికారి అనంత్‌ను నిలదీశారు. తాను తప్పు చేశానని, క్షమించమని కోరారు. దీంతో అక్కడున్న ఓటర్లు ఆయనపై తీవ్రంగా మండిపడ్డారు. అధికారి వల్ల తమ ఓటుకు స్వేచ్ఛకు భంగం కలిగిందంటూ ఆవేదన వ్యక్తం చేవారు. ఈ విషయంపై తహసీల్దార్ ఫణికుమార్ వివరణ కోరగా ప్రాథమిక సమాచారం మేరకు ఈఆర్ఓ నారపురెడ్డి మౌర్య దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి సూచనల మేరకు చర్యలుంటాయన్నారు.

వృద్ధుల ఓట్లను బదలాయించిన ఉద్యోగులు

● ఫ్యాన్‌కు బదులు సైకిల్ బటన్ నొక్కి మోసం
● విషయం గ్రహించి పలు చోట్ల నిలదీత

కర్నూలు: కర్నూలు వెంకటరమణ కాలనీ సమీపంలోని ఓ పోలింగ్ బూత్‌కు ఉదయం 11 గంటల సమయంలో చెన్నయ్య అనే 78 ఏళ్ల వృద్ధుడు కుటుంబ సభ్యుల సహకారంతో ఓటు వేసేందుకు మూడు చక్రాల బండిపై వచ్చాడు. ఓటరు స్లిప్, గుర్తింపు కార్డు పోలింగ్ సిబ్బందికి చూపించి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈవీఎం దగ్గరకు వెళ్లగా గుర్తు సరిగా కనిపించకపోవడంతో సహాయం కోరారు. అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగికి ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని వృద్ధుడు చెప్పగా సైకిల్ గుర్తు బటన్ నొక్కి మోసం చేశాడు.

☛ కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలోని ఓ పోలింగ్ బూత్‌లో 76 ఏళ్ల వయస్సున్న నిరక్షరాస్యురాలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చింది. ఆమె కూడా ఫ్యాన్ బటన్‌పై నొక్కాలని అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగిని కోరగా సైకిల్ గుర్తుపై ఓటు వేయించి నమ్మించి మోసం చేసే ప్రయత్నం చేశాడు. అయితే అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు గుర్తించి పెద్ద ఎత్తున గొడవకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి అందరినీ శాంతింపజేసి పరిస్థితిని చక్కబెట్టారు.

☛ 45వ వార్డులోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఏకంగా టీడీపీ అభ్యర్థికి ప్రచారం చేశాడు. ఓటరు స్లిప్పులు పంపిణీ చేయడమే కాక సైకిల్‌కు ఓట్లు వేయండి అంటూ స్వామిభక్తి చాటుకున్నాడు. ఇలా కర్నూలు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బంది భద్రతా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించడం కనిపించింది.

బూత్‌ల వద్ద ప్రచారం చేసినా పట్టించుకోని పోలీసులు

పోలింగ్ కేంద్రాలకు పార్టీ శ్రేణులు వంద మీటర్ల దూరం ఉండాలన్నది నిబంధన. అయితే, టీడీపీ కార్యకర్తలు వాటిని తుంగలో తొక్కి క్యూలైన్ల వద్దకు వెళ్లి పలు పోలింగ్ కేంద్రాల్లో సైకిల్‌కు ఓటు వేయండి అంటూ ప్రచారం నిర్వహించారు. కప్పల్ నగర్‌లోని ఓ పోలింగ్ బూత్ దగ్గరికి వెళ్లి టీడీపీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించినప్పటికీ విధుల్లో ఉన్న పోలీసులు కనీసం మాట మాత్రంగా కూడా వారిని వారించలేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ...

శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనుకున్నప్పుడు పరిస్థితులు చేయి దాటకుండా ఉండేందుకు ముందస్తుగా పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. ఇది అమలులో ఉన్నప్పుడు నలుగురికి మించి గుమికూడటం, కలిసి తిరగడంపై నిషేధాజ్ఞలు ఉంటాయి. టీడీపీ కార్యకర్తలు పోలీసు ఆజ్ఞలను కూడా లెక్క చేయకుండా తమ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారాలు నిర్వహించడం కనిపించింది. పాతబస్తీలోని 226 పోలింగ్ బూత్‌లో మైనార్టీలు అధికంగా తరలివచ్చి క్యూలైన్‌లో నిలబడి ఉండగా టీడీపీ అభ్యర్థి అక్కడికి వచ్చి తనకు వ్యతిరేకంగా పోలింగ్ జరుగుతుందని తలంచి పోలీసుల సహాయంతో బెదిరించి అక్కడున్న ఓటర్లను వెనక్కు పంపించేశారు. కేంద్రం పరిశీలించేందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థి అక్కడి వాతావరణం చూసి తట్టుకోలేక అక్కడినుంచి బయటకు వెళ్లి ఫోన్‌లో మాట్లాడారు. కొద్దిసేపటికే ఓ పోలీసు అధికారి అక్కడికి వచ్చి సిబ్బంది చేత ఓటర్లను బెదిరించి బయటకు పంపి పోలింగ్ కేంద్రానికి గేట్లు మూయించారు.

దాడులకు దిగిన టీడీపీ

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. పూడిచెర్ల, హుసేనాపురం, హెచ్.కొట్టాల, శకునాల, నన్నూరు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీమద్దతుదారులు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ రాజారెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలాలకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.